
గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : కలెక్టర్
8లో..

నేడు ఖనిలో టీబీజీకేఎస్ వర్కింగ్ కమిటీ సమావేశం






# ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖరారు

- కాంగ్రెస్ నుంచి గడ్డం వంశీకృష్ణ
- బీఆర్ఎస్ నుంచి కొప్పుల ఈశ్వర్
- బీజేపీ నుంచి గొమాసే శ్రీనివాస్
- జోరుగా కార్యకర్తల సన్నాహక సమావేశాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయనున్న తమ అభ్యర్థులను ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రకటించాయి. గురువారం రాత్రి కాంగ్రెస్ పార్టీ గడ్డం వంశీకృష్ణ పేరును ఖరారు చేయగా, అంతకుముందే బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీజేపీ అభ్యర్థిగా గొమాసే శ్రీనివాస్‌ల పేర్లను ప్రకటించారు. ఈ ముగ్గురి అభ్యర్థుల మధ్యే ప్రధానంగా పోటీ జరగనున్నది. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు పార్టీపరంగా నాయకులు, కార్యకర్తలను సన్నద్ధం చేసేందుకు అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా సన్నాహక సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ఈనెల 16న కేంద్ర ఎన్నికల కమిషనర్ షెడ్యూల్‌ను ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఏడు విడతల్లో ఎన్నికలను నిర్వహిస్తుండగా, నాల్గవ విడతలో రాష్ట్రంలో ఎన్నికలను నిర్వహిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేనెల 18న జారీ కానుండగా, అదేరోజు నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహించనున్నారు. దీంతో ఎన్నికల ప్రక్రియ ముగియనున్నది.

**● పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ ఆరాటం..**

పోలింగ్‌కు యాభై రోజుల వరకు సమయం ఉండడంతో అభ్యర్థులు గెలుపు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. దీంతో పార్లమెంట్



ఎన్నికల్లోనూ ఇక్కడ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేస్తామని ఆ పార్టీ నేతలు ఆశాభావంతో ఉన్నారు. ఈ నియోజకవర్గం నుంచి చివరిసారిగా 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి డాక్టర్ గడ్డం వివేక్ గెలుపొందగా, 2014, 2019 ఎన్నికల్లో వరుసగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు బాల్క సుమన్, బొర్లకుంట వెంకటేశ్ నేత గెలుపొందారు. ఈ ఎన్నికల్లో పూర్వ వైభవాన్ని చాటాలని ఆ పార్టీ నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. పార్టీ అభ్యర్థిగా వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ పోటీ చేస్తుండగా, వివేక్ సోదరులు ఇరువురు చెన్నూర్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి ఇదే నియోజకవర్గం నుంచి పలుమార్లు ఎంపీగా గెలుపొందడంతో పాటు కేంద్ర మంత్రిగా పని చేసిన నేపథ్యంలో ఆయన వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చిన వివేక్, ఆయన వారసుడిగా వచ్చిన వంశీకృష్ణ పోటీ చేయనున్నారు. ఈ ప్రాంతానికి వాళ్లు సుపరిచితులు కావడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం తమకు కలిసి రానున్నదని భావిస్తున్నారు. ప్రచారానికి కూడా సమయం బాగానే ఉండడంతో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో వ్యూహాత్మకంగా ముందుకు సాగేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

**● సత్తా చాటేందుకు బీఆర్ఎస్ సంసిద్ధం..**

వరుసగా మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించేందుకు బీఆర్ఎస్ సంసిద్ధం అవుతున్నది. ఇక్కడినుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేతకు ఈసారి టికెట్ ఇవ్వకుండా మరొకరికి ఇవ్వాలని పార్టీ అధినేత కేసీఆర్ భావించారు. దీంతో వెంకటేశ్ నేత పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ ఆయనకు పార్టీ టికెట్ రాకపోగా, రెంటికి చెడ్డ రేవడిలా ఆయన పరిస్థితి మారింది. పార్టీ సీని యర్ నేత ఆరుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ బావుటా ఎగురవేసిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు మొదటి విడతలోనే కేసీఆర్ టికెట్ ప్రకటించారు. సింగరేణి కార్మికుడిగా పని చేస్తూ రాజకీయాల్లోకి వచ్చిన కొప్పుల



ఈశ్వర్ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో అనేక మందితో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా అందరికి ఆయన సుపరిచితుడే. ఈ ఎన్నికల్లో సింగరేణి కార్మికుల ఓట్లు కీలకంగా మారనుండడంతో పార్టీ కొప్పుల ఈశ్వర్‌ను రంగంలోకి దింపింది. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన హామీలను సక్రమంగా నెరవేర్చలేక పోయిందని, బీఆర్ఎస్ పాలననే ప్రజలు కోరుకుంటున్నారని అంటున్న ఆ పార్టీ నాయకులు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు తమవైపే మొగ్గు చూపుతున్నారని ఈ ఎన్నికల్లో గెలవడం ఖాయమని అంటున్నారు. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా అభ్యర్థి ఈశ్వర్ పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకు యాత్ర నిర్వహించాలని భావిస్తున్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో రెండు భారీ బహిరంగ సభలకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

**● ఖాతా తెరిచేందుకు బీజేపీ తహతహ..**

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కాషాయ జెండాను ఎగురవేసి ఖాతా తెరవాలని తహతహలాడుతున్నది. ఏ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు బీజేపీ గట్టి పోటీనివ్వకపోగా, ఈసారి బలమైన నేతను బరిలోకి ఆ పార్టీ దింపుతున్నది. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు, నేతకాని సామాజిక వర్గానికి చెందిన గొమాసే శ్రీనివాస్ వారం రోజుల క్రితం కాంగ్రెస్‌ను వీడి



బీజేపీలో చేరి టికెట్ తెచ్చుకున్నారు. ఇదే నియోజక వర్గం నుంచి 2009 ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి 49,031 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి జి వివేక్‌పై శ్రీనివాస్ ఓటమి చెందారు. ఆ ఎన్నికల తర్వాత 2014, 2019 ఎన్నికల్లో ఆశించినప్పటికీ కాంగ్రెస్ టికెట్ రాలేదు. మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రంగంలోకి దిగుతున్నారు. నియోజకవర్గ వ్యాప్త ంగా ఆయా వర్గాలతో విస్తృతంగా తనకు ఉన్న పరిచయాలకు తోడు ప్రధాని నరేంద్ర మోదీ మానియా, దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ హవా తనకు తోడై విజయం సాధిస్తామనే ధీమాతో గొమాసే శ్రీనివాస్ ఉన్నారు. ఇప్పటికే ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలను సన్నద్ధం చేస్తున్నారు. పలు బహిరంగ సభలకు సన్నాహాలు చేస్తున్నారు.

## ఎన్టీపీసీలో ఘనంగా జల దినోత్సవం



వాటర్ డే ర్యాలీలో పాల్గొన్న ఈడీ కేదార్ రంజన్, ఉద్యోగులు

జ్యోతినగర్, మార్చి 22 : ప్రపంచ జల దినోత్సవాన్ని శుక్రవారం రామగుండం ఎన్టీపీసీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్‌షిప్‌లో వాటర్ డే ర్యాలీని నిర్వహించారు. ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో ఉద్యోగులు, అధికారులు, సీఐఎస్ఎఫ్ జవానులు పాల్గొన్నారు. అలాగే నీటి ప్రాధన్యతను తెలియజేస్తూ విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్ అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఈడీ కేదార్ రజంన్ పాండు మాట్లాడతూ నీటిని వృథా చేయకుండా సంరక్షించాలన్నారు. ప్రపంచంలోని జీవరాశులకు నీరే ఆధారమని, నీరు లేనిదే ఏ జీవానికి మనుగడ లేదన్నారు. అనంతరం ఈడీ కేదార్ రంజన్ సిబ్బందితో జల ప్రతిష్ట చేయించారు. వాటర్ డేను ఎన్టీపీసీలో వారం రోజులు నిర్వహించనున్నారు. వారోత్సవాలలో భాగంగా విద్యార్థులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తారు. ఈఎంజీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ విభాగాల జీఎంలు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టీబీరహిత జిల్లాగా మార్చేందుకు కృషి

**- జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రమోద్‌కుమార్

పెద్దపల్లిటౌన్, మార్చి 22: జిల్లాను 2025 నాటికి టీబీ రహితంగా మార్చాలనే లక్ష్యంతో గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తూ జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తున్నామన్నారు. ఆయన కార్యాలయంలో టీబీ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్ శుక్రవారం మీడియా సమావేశంలో వివరించారు. జిల్లాలోని 87 లక్షల జనాభాను కవర్ చేస్తూ 5 టీబీ సెంటర్లు పెద్దపల్లి, రామగుండం మంథని, సుల్తానాబాద్, కాల్వ శ్రీరాంపూర్‌లలో వైద్య సేవలు అందిస్తున్నట్లు, 24 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 14 డీఎంసిలు, టీబీ వ్యాధి నిర్ధారణ ఉపయోగించే సిబినాట్ యంత్రం గోదావరిఖనిలో, ట్రునాట్ యంత్రాలు పెద్దపల్లి, మంథనిలో ఉన్నాయని తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్, ఎంహెచ్ఎస్ డాక్టర్ వాణిశ్రీ, టీబీ కోఆర్డినేటర్ ప్రభాకర్, రాజేష్, తదితరులు ఉన్నారు.

## కూరగాయల మార్కెట్ అభివృద్ధికి కృషి

**- మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ**



కూరగాయల మార్కెట్‌లో వినియోగదారులతో మట్లాడుతున్న చైర్‌పర్సన్

మంథని మార్చి 22: మంథని కూరగాయల మార్కెట్‌లో వినియోగదారులకు, చిరు వ్యాపారులకు సౌకర్యాలు కల్పించి సమగ్రంగా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక కూరగాయల మార్కెట్‌ను ఆమె పాలకవర్గంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు, కూరగాయల విక్రయదారులు వారి సమస్యలను మున్సిపల్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. ఉదయం హోల్‌సేల్ నిర్వహిస్తున్న కొంతమంది పెద్ద వ్యాపారులు తిరిగి సాయంత్రం వరకు కూరగాయలను దుకాణాలు నిర్వహించడంతో చిన్న వ్యాపారస్తులకు ఇబ్బంది కలుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నాన్ వెజ్ మార్కెట్లో సైతం వీధి దీపాలను ఏర్పాటు చేయాలని దుకాణాల నిర్వాహకులు చైర్ పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి సానుకూలంగా స్పందించిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి మాట్లాడుతూ హోల్‌సేల్ వ్యాపారస్తులను పిలిచి మాట్లాడుతానని హామీ ఇచ్చారు. నాన్ వెజ్ మార్కెట్‌లో లైటింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మార్కెట్ రోడ్లపై సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా, వ్యాపారస్తులు వారి దుకాణాల లోపలనే సామాన్లు ఉంచుకొని వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ శ్రీపతి బాలయ్య, కౌన్సిలర్లు వీకే రవి, లింగయ్య, వేముల లక్ష్మి, గుండా విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఇనుముల సతీష్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా హరితహారం నిర్వహణకు చర్యలు

**- సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు**



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

సుల్తానాబాద్, మార్చి 22: రాబోయే హరితహారం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు తెలిపారు. శుక్రవారం స్థానిక మార్కండేయ కాలనీలోని నర్సరీని ఆమె కౌన్సిలర్లుతో అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడున్న మొక్కల గురించి అడిగి తెలుసుకున్నారు. రాబోయే హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు అనువైన ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలు, కాలనీలను ఎంపిక చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కూకట్ల గోపి, రాజయ్య, నాయకులు బిరుదు రాధాక్రిష్ణ, రఫీక్, చింతల రాజు పాల్గొన్నారు.

### ఆగని ఇసుక అక్రమ రవాణా

పెద్దపల్లి రూరల్, మార్చి 22: మండలంలోని పెద్దకల్వల గ్రామానికి ఆనుకొని ఉన్న హుస్సేన్‌మియా వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తు న్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులకు పలుమా ర్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అక్రమ రవాణను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

## సమృద్ధిగా తాగునీరు అందించేందుకు కార్యాచరణ

**- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవిలో సమృద్ధిగా తాగునీరు అందించే విధంగా పటిష్ఠ కార్యాచరణ రూపొందించి దాని అమలుకు కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో రాబోయే వేసవికాలంలో తాగునీటి సరఫరాపై మండల, మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎండాకాలం దృష్ట్యా తాగునీటి సరఫరా పకడ్బందీగా ఉండేలా చూడాలని, చిన్న ఇబ్బంది ఎదురైనా సమస్య తీవ్రత ఎక్కువ చూపే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. పక్కా ప్రణాళికతో మనం చర్యలు తీసుకుంటే ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరా చేయవచ్చని తెలిపారు. జిల్లాలో తాగునీటి సరఫరా కోసం స్థానిక సంస్థలు గ్రామపంచాయతీల వద్ద అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకొని అవసరమైన పనులను చేపట్టాలని, స్థానిక సంస్థల పరిధిలో చేసే పనులకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అడ్డు రాదని కలెక్టర్ తెలిపారు. గ్రామంలో పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీలలో వార్డుకు ప్రత్యేక అధికారిని కేటాయిస్తూ నీటి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ, జడ్పీ సీఈవో కె నరేందర్, డీపీఓ ఆశాలత, మిషన్ భగీరథ, ఆర్ డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ ఇఇలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, డీఇఇలు, డివిజనల్ పంచాయత్ అధికారులు, ఎంపీఓలు, ఏఇఇలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం

**- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్**



డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, మార్చి 22: రామగుండం కార్పొరేషన్‌లో ప్రజా సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా పెట్టుకున్నట్టు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం 42వ డివిజన్ మేదరిబస్తీలో రోడ్లు, డ్రైనేజీలను ఆయ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు, ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, మంచి నీరు, విద్యుత్, రోడ్ల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని చెప్పారు.డివిజన్‌లో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షుని దృష్టికి తీసుకెళ్లాలని, అప్పుడే సమస్యలు తొందరగా పరిష్కారమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్ కుమార్, కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు దశరథం, కీర్తి నాగరాజు పాల్గొన్నారు.

**రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే..**

కళ్యాణ్‌నగర్, మార్చి 22: ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం హజ్ కమిటీ సభ్యురాలు, 49వ డివిజన్ కార్పొరేటర్ సనాఫకృద్దీన్ ఆధ్వర్యంలో జమా మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు ఎప్పటికీ అండగా ఉంటుందని, ఫోరింక్లయిన్‌గడ్డ వద్ద ఖబరస్థాన్ చుట్టూ గోడ నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో వంద రోజుల్లోనే ఐదు పథకాలను అమలుచేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ అనీల్ కుమార్, కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకులు ఫకృద్దీన్, నజీమోద్దీన్ పాల్గొన్నారు.

## స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

**- రామగుండం సీపీ శ్రీనివాస్ - సీఆర్‌పీఎఫ్ బలగాల ఫ్లాగ్ మార్చ్**



మార్చ్ ఫాస్ట్‌లో పాల్గొన్న సీపీ, పోలీస్ అధికారులు

కోల్‌సిటీ, మార్చి 22: పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. ప్రజలు తామ ఓటు హక్కు వినియోగించుకునేలా వారిలో నమ్మకం, భరోసా, భద్రత కలిగేలా గోదావరిఖనికి వచ్చిన సీఆర్‌పీఎఫ్ బలగాలతో గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి గాంధీచౌక్ మీదుగా లక్ష్మీనగర్, రమేష్‌నగర్, తిలక్‌నగర్, పరశురాంనగర్ నుంచి జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో ఎలాంటి భయాందోళనకు తావు లేకుండా చేయడంలో భాగంగా స్థానిక పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజలందరికీ ఎన్నికల పట్ల భద్రత, భరోసా కల్పించడానికి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి కమిషనరేట్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతుందని, ఎవరైనా అల్లర్లు సృష్టించాలని చూస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీపీ కోరారు. జిల్లాలో అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులు అక్రమ రవాణా అరికట్టేందుకు చెక్‌పోస్ట్ దగ్గర, జిల్లా పరిధిలో ఆకస్మికంగా పకడ్బందీగా నాకబందీ, వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన, అసిస్టెంట్ కమాండెంట్ పరమానంద్, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్లు ఇంద్రసేనారెడ్డి, రవీందర్, గోదావరిఖని టుటౌన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, లింగమూర్తి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో మాధవి

కాల్వశ్రీరాంపూర్, మార్చి 22: మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలను ప్రార్థన సమయంలో శుక్రవారం డీఈవో మాధవి ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలోని పెగడపల్లి, పెద్దంపేట ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసి హాజరు రిజిష్టర్ పరిశీలించారు. డీఈవో తనిఖీ చేసే సమయంలో ఉపాధ్యాయులందరూ హాజరయ్యారు. దూర ప్రాంతాల నుంచి రైలులో వచ్చే ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుంటే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలో విద్యార్థులకు పెట్టే వంటలను పరిశీలించారు. ఎండీఎం సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించుటకు బడ్జెట్ విడుదల చేయడం జరిగింది అన్నారు. విద్యార్థులకు వారానికి మూడు కోడిగుడ్లు ఇవ్వాలని, మెనూ ప్రకారం బ్రేక్ ఫాస్ట్ కంటిన్యూ చేయాలన్నారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం విద్యార్థులకు చదువులో గ్యాప్ రాకుండా ఉండేందుకు వేసవి సెలవుల్లో స్వచ్ఛంద సంస్థలతో సమ్మర్ క్యాంపు నిర్వహించుటకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డీఈఓ వెంట ఎంఈవో రాజన్న ఉన్నారు.

# ధర్మారంలో రోడ్డు ప్రమాదం

● ఇద్దరికి గాయాలు

కోనరావుపేట, మార్చి 22 : రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో బైక్‌పై కూర్చున్న వ్యక్తిని మరో వాహన దారుడు ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. దీంతో వీరిని సిరిసిల్ల ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. స్థానికుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో పనిచేస్తున్న వలస కూలి రాంబాబు ధర్మారం గ్రామంలోని ఆన్‌లైన్ సెంటర్ వద్ద ఆగి ఉన్న బైక్‌పై కూర్చున్నాడు. తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై వెళ్తూ ఆగి ఉన్న బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడిపోయారు. వారికి తీవ్ర గాయాలు కావడంతో సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు.

# బ్రహ్మోత్సవాలకు పెరిగిన రద్దీ

- గోదావరి నదిలో పుణ్య స్నానాలు - రాత్రి స్వామి వారల సేవ ఊరేగింపు



పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తున్న స్వామి వారల సేవలు

ధర్మపురి, మార్చి 22: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ పెరిగింది. లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి, అ నుబంధ ఆలయాలకు చేరుకున్నారు. అనంతరం వెంట తెచ్చుకున్న కట్న కానుకలు, అమ్మ వారలకు ఒడి బియ్యం సమర్పించారు. కోడె మొక్కులు, వల్లు బండ వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం పక్షాన దాతల సహకారంతో సుమారు 7 వేల మంది భక్తులకు అన్న దానం చేశారు. ఆలయ ఈవో సంక టాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ పర్యవేక్షణలో కమిటీ సభ్యులు సేవలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి రంగశం కరయ్య, సత్రం కోశాధికారి జక్కు దేవేందర్, ఇనుగంటి వేంకటేశ్వర్‌రావు, గునిశెట్టి రవీందర్, సత్తయ్య, మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు

### సర్వ దేవతా హోమం..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆలయ వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు, హారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలతో పాటు సర్వ దేవతా, శాంతి హోమాలు నిర్వహించారు.

### స్వామి వారల సేవ ఊరేగింపు..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రాత్రి వేళలో శ్రీ స్వామి లక్ష్మీ నరసింహస్వామి వారల సేవలను ఆశ్వ వాహనంపై ఊరేగించారు.



మొక్కులు చెల్లించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

స్వామి వారల సేవలు పుర వీధుల గుండా ఇసుక స్తంభంవద్దకు తీసుకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దారి పొడవుగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి దర్శనం చేసుకున్నారు. తిరిగి స్వామి వారల సేవలను ఆలయానికి తీసుక వెళ్లారు. కాగా బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి రెండో రూ 4,16,455 ఆదాయం లభించినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఇందులో స్వామి వారల వివిధ రకాల పూజల టికెట్ల విక్రయం ద్వారా 2,29,216, ప్రసాదాలు విక్రయం ద్వారా రూ 1,23,000 లభించగా, అన్నదానం కోసం భక్తులు, దాతల ద్వారా సేకరించిన రూ 64,439 విరాళాలు ఉన్నట్లు ఆయన వివరించారు

### బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి 7 గంటలకు శ్రీ వేంకటేశ్వరస్వామి ఊరేగింపు సేవ ఉంటుంది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా స్థానిక శేషప్ప కళావేదికపై రాత్రి ఉషాగాయత్రి కూచిపూడి నృత్యప్రదర్శన ఉంటుందని, రాత్రి 7-30 గంటల నుంచి భక్తి సంగీత విభావరి, నృత్య ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయని ఈవో తెలిపారు.



ధర్మపురి గోదావరి నది వద్ద భక్తుల సందడి

### ఆకట్టుకున్న భక్తి సంగీత విభావరి



ధర్మపురి శేషప్ప కళావేదికపై కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

**ధర్మపురి:** ధర్మపురి క్షేత్రంలోని శేషప్ప కళా వేదికపై శుక్రవారం రాత్రి కళాకారులచే నిర్వహించిన భక్తి సంగీతం భక్తులను ఆకట్టుకుంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శేషప్ప కళావేదికపై స్థానిక కళాకారులు జి శంకర్‌శర్మ, ఎస్ రామకిష్టయ్య, కె విశ్వనాథం, పి చంద్రమౌళి, జె నర్సయ్య, కె. శంకర్, కె దత్తాత్రి పాడిన భక్తి సంగీత పాటలు ఆకట్టుకున్నాయి. అలాగే గర్షకుర్తికి చెందిన శశికళ, రాజమల్లయ్య బృందంచే భక్తి సంగీత విభావరి, మంచిర్యాల నందిని నృత్యాలయంచే కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. హైదరాబాద్ సరస్వతి సంగీత నృత్య శిక్షణాలయం ప్రతిమ శశిధర్‌చే భక్తి సంగీత విభావరి అలరించింది. కళాకారులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ శాలువా కప్పి సన్మానించారు. ప్రోగ్రాం ఇన్‌చార్జిగా ఎస్ఎల్ఎన్ నాట్యమండలి కార్యదర్శి కొరిడె నరహరి, పక్క వాద్య కళాకారులుగా రామయ్యశర్మ (కీబోర్డు), ఎస్ వేణుగోపాల్ (మృదంగం), రమేశ్ (తబలా), శ్రీధర్ (కీబోర్డు), రాజేశం (మృదంగం, తబలా, మోర్‌సింగ్), సుదర్శనా చార్యులు (మృదంగం), రవీందర్ (ఫ్లూట్ ), సంతోష్ (మృదంగం), ప్రవీణ్ (కీబోర్డు), అరుణ్ (తబల) వ్యవహరించారు.

# మహిళ దారుణ హత్య

● రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అనంతనగర్‌లో ఘటన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న టౌన్ సీఐ రఘుపతి

సిరిసిల్ల క్రైం, మార్చి 22: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అనంతనగర్‌లో మహిళ దారుణ హత్యకు గురైంది. శుక్రవారం వెలుగు చూసిన ఘటన వివరాలను సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి వెల్లడించారు. బీహార్‌కు చెందిన ఆరుగురు కార్మికులు సిరిసిల్ల పట్టణంలోని అనంతనగర్‌లో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తున్నారు. మూడు రోజులుగా ఆ ఇంటి తలుపులు తెరవడం లేదు. గది నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఇంటి తాళం పగలగొట్టి చూడగా రక్తపు మడుగులో మహిళ మృతదేహం పడి ఉంది. తల వెనుక భాగంలో పదునైన ఆయుదంతో దాడి చేశారు. మృతదేహాన్ని పరిశీలించి న పోలీ సులు వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ గ్రామానికి చెందిన అలకుంట రమ (41)గా గుర్తించారు. కొడుముంజకు చెందిన రమ భర్త రాజయ్య మూడేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. దీంతో కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. భవన నిర్మాణ పనుల కోసం ప్రతీ రోజు కొడుముంజ నుంచి సిరిసిల్ల లేబర్ అడ్డాకు వచ్చి కూలీ పనికి వెళ్తుంది. ఇదే క్రమంలో బీహార్‌కు చెందిన కార్మికులతో పరిచయం ఏర్పడినట్లు, వారితో పనికి వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అద్దె ఇంటికి తీసుకెళ్లిన కార్మికులు మద్యం తాగి ఆమెపై అత్యాచారం చేసేందుకు యత్నించగా ఎదురు తిరగడంతో హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### కాకతీయ కాలువకు కొనసాగుతున్న నీటి విడుదల

జగిత్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల శుక్రవారం కొనసాగింది. యాసంగి పంట సాగునీటి కో సం ఎస్సారెస్పీ అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 3,500 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతం డ్యామ్‌లో 18.715 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 5,396 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఇందులో కాకతీయ కాలువకు 3,500, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, అల్లిసాగర్ ఎత్తిపోతల పథకా నికి 347 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 146 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథ పథకాలకు 231 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది.

### క్రీడలతో స్నేహ సంబంధాలు

మానకొండూర్, మార్చి 22: క్రీడలు యువత మధ్య స్నేహ సంబంధాలు పెంచుతాయని మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ 17వ ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 40 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు బొట్ల కిషన్, మాజీ ఉపసర్పంచు మూగల మహేందర్‌రెడ్డి, నిర్వాహకులు పాఖాల శంకర్, గ్రామస్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పుస్తెల తాడు అపహరణ



గాలిస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం

వెల్గటూర్, మార్చి 22: మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారు జామున ఓ వృద్ధురాలి మెడలో నుంచి దుండగుడు పుస్తెల తాడు అపహరించిన సంఘటన కలకలం రేపింది. బాధితురాలు గుమ్ముల నర్సమ్మ తెలిపిన వివరాల ప్రకారం తెల్లవారు జామున కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆరు బయటికి వెళ్లింది. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన దుండగుడు ఆమె మెడలోని పుస్తెల తాడు అపహరించడానికి ప్రయత్నించాడు. ఈ సంఘటనతో తేరుకున్న వృద్ధురాలు ఆ దుండగుడితో కాసేపు పెనుగులాడింది. ఈ క్రమంలో పెస్తెల తాడు తెగిపో యింది. రెండు తులాల పుస్తెల తాడు లాక్కొని దుండగుడు పరార య్యాడు. తెల్లవారు జాము కావడంతో ఎవరూ బయట లేకపోవడంతో అరిచినప్పటికీ లాభం లేకపోయింది. ముఖానికి దస్తీ కట్టుకోవడం దానికి తోడు చీకటిగా ఉండడంతో దుండగుని ముఖం గుర్తించలేదని వృద్ధురాలు రోదిస్తూ చెప్పింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై ఉమాసాగర్ డాగ్ స్క్వాడ్ బృందంతో గాలింపు చేపట్టారు.

### బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌పై విద్యార్థులకు అవగాహన

కరీంనగర్ టౌన్, మార్చి 22: నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (కార్ఖానగడ్డ)లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం వినియోగదారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అంబురాథోడ్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్) సభ్యులు జయశ్రీ, ఫోరం జిల్లా అధ్యక్షుడు జీవన్ పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వస్తువులు, ఉత్పత్తులు, ఆహారం, నీరు, తూనికలు, కల్తీ వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బీఐఎస్ అవగాహనపై పరీక్ష నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థి విజేతలకు 1000,750,500,250 రూపాయల నగదు బహుమతు లను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ సత్యనారాయణ చారి, ఉపాధ్యాయురాలు త్రివేణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### వడదెబ్బతో రైతు మృతి



జగన్(ఫైల్)

మానకొండూర్, మార్చి 22: మండలంలోని పెద్దూరుపల్లి గ్రామంలో పంది జగన్(55) అనే రైతు శుక్రవారం వడదెబ్బతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన పంది జగన్ అనే రైతు తన రెండు ఎకరాల పొలంలో ఆడ మగ వరి పంటను సాగు చేస్తున్నాడు. రెండు మూడు రోజులుగా తన పొలంలో వరిని దులుపుతున్నాడు. అందులో భాగంగా శుక్రవారం కటుంబ సభ్యులతో దులుపుతుండగా అస్వస్థతకు గురి అయ్యాడు. చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వడదెబ్బతో మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు

### దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, మార్చి22: ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 15 నుంచి 30రోజుల పాటు ఫొటో గ్రఫీ అండ్ వీడియో, ఏప్రిల్ 18నుంచి సీసీటీవీ ఇనస్టాలేషన్ అండ్ సర్వీసింగ్‌లో పురుషులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల అభ్య ర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9949448157, 9849411002 నంబర్లలో సంప్రదించాలని సంస్థ డైరెక్టర్ తెలిపారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

### తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

జగిత్యాల టౌన్, మార్చి 22: జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీరయ్య గుడి ప్రాంతంలో ఉన్న ఓ ఇంటిలో చోరీ జరిగింది. బీరయ్య గుడి ప్రాంతానికి చెందిన రాజేశం రెండు రోజుల క్రితం ఎండపెల్లి మండల కేంద్రానికి కుటుంబంతో వెళ్లారు. గురువారం రాత్రి ఇంటికి తిరిగి చేరుకున్న రాజేశం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో చోరీ అయినట్లు గుర్తించారు. గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారంతో పాటు రూ. 10 వేల నగదును అపహరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేలి ముద్రలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కమాన్‌పూర్, మార్చి 22 : మండలంలోని గుండారం గ్రామంలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు,కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన కాశెట్టి సతీష్(38) గుండారం గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. ఈక్రమంలో తెల్లవారుజామున తన స్వగ్రామానికి వచ్చేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

### బావిలో పడి మహిళ..

ఇల్లందకుంట, మార్చి 22: మండలంలోని సీతంపేట గ్రామంలో మతిస్థిమితం లేని జోరుక రమ (40) అనే మహిళ వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రమకు మూడు నెలలుగా మతి స్థిమితం కోల్పోయింది. గురువారం తన సొంత గ్రామమైన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పర్లపల్లి గ్రామం నుంచి తమ బంధువులైన సీతంపేట గ్రామానికి వచ్చి తిరిగి పర్లపల్లి వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయింది. శుక్రవారం సీతంపేట గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. మృతురాలి భర్త రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజకుమార్ తెలిపారు.

### డీవైడర్‌ను ఢీకొని రైతు దుర్మరణం

ఎల్లారెడ్డిపేట, మార్చి 22 : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన చందుపట్ల లక్ష్మారెడ్డి (45) అనే రైతు శుక్రవారం రాత్రి దుర్మరణం పాలయ్యాడు. లక్ష్మారెడ్డి గొల్లపల్లి నుంచి తన భార్య, సమీప బంధువుతో కలిసి ఎల్లారెడ్డిపేట వైపు బైక్‌పై వస్తుండగా డీవైడర్‌ను ఢీకట్టి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడిక్కడే మృతిచెందాడు. లక్ష్మారెడ్డి రెండు సంవత్సరాల క్రితం విదేశాల నుంచి వచ్చి వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య రేణుక, బంధువుకు గాయాలు కావడంతో స్థానికులు గమనించి అసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

### ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

హుజూరాబాద్, మార్చి 22: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన గంట కుమారస్వామి (26) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుమారస్వామి ఆరు నెలల నుంచి మద్యానికి బానిసై ఇంట్లో తరుచూ భార్యతో గొడవపడేవాడు. గొడవలు, మద్యం మానలేక మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లో రేకుల షెడ్డు ఇనుప పైపుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్యతో పాటు ఒక కూతురు ఉన్నారు. మృతుడి తండ్రి గంట సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు.

### డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 22: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వ్యక్తులకు శుక్రవారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ మూడు రోజులు జైలుశిక్ష లేదా రూ.5,500లు జరిమానా విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. 10 మంది వాహనదారులను కోర్టులో హాజరుపరచగా మరో ఏడుగురు వ్యక్తులకు 11,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

### ఒకరికి జైలు శిక్ష

కోల్‌సిటీ, మార్చి 22: రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన సిద్దేశ్వర్ తల్వార్ అనే వ్యక్తికి శుక్రవారం గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ఎదుట హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ 3రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

### ముగిసిన ఏఎస్ఐ అంత్యక్రియలు

కరీంనగర్ క్రైం/తిమ్మాపూర్, మార్చి 22 : కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాలో పనిచేస్తున్న ఏఎస్ఐ గురువారం మరణించగా అంత్రక్రియలు శుక్రవారం నిర్వహించారు. తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లిలో నిర్వహించిన ఏఎస్ఐ కిషన్ అంత్యక్రియల్లో కరీంనగర్ అడిషనల్ డీసీపీ(ఏఆర్) అనోక్‌జైన్ పాల్గొన్నారు. కిషన్ కుటుంబ సభ్యులను పరామర్శించిన అడిషనల్ డీసీపీ వారి కుటుంబానికి ఎళ్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చొప్పదండి, మార్చి 22: చొప్పదండి శివారులోని కాకతీయ కాలువ డి86 డిస్ట్రిబ్యూటర్ వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. కాలువకు సంబంధించిన లస్కర్ కనుకయ్య శుక్రవారం మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారాన్ని అందించాడు. సంఘటన స్థలానికి ఎస్సై ఉపేంద్రచారీ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 30 నుంచి 40 ఏండ్ల వయస్సు గల మహిళ మృతదేహంగా భావిస్తున్నారు. మృతదేహం బాగా కుల్లిన స్థితిలో ఉందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాలకుర్తి, మార్చి22: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీడినగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు బసంత్‌నగర్ ఎస్సై ఆర్ స్వామి తెలిపారు. కుంటాల కొండయ్య అనేవ్యక్తి పెద్దకుమారుడు విజయ్‌కుమార్ మానసిక రుగ్మతతో బాధపడుతూ మందులు వాడుతున్నాడు. ఈనెల 17న మోతాదుకు మించి మందులు వేసుకోగా, కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని, కొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

### గోదావరిలో పడి పశువుల కాపరి మృతి

మల్లాపూర్, మార్చి, 22 : మండలంలోని వాలొండ గ్రామ శివారులోని ప్రమాదవశాత్తు గోదావరిలో పడి పశువుల కాపరి పుట్ట గంగరాం(55) నీట మునిగి మృతి చెందినట్లు శుక్రవారం ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన పుట్ట గంగరాం తన కొడుకు పుట్ట సురేష్‌తో కలిసి పశువులను మేపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో పశువులను మేపుకుంటూ మండలంలోని వాల్గొండ గంగ సమీపానికి వచ్చారు. అక్కడ ప్రమాదవశాత్తు గంగారాం నీట మునిగి మృతి చెందినట్లు తెలిపారు. గంగారాం కొడుకు సురేష్ ఫిర్యాదు మేరకు సంఘటన స్థలం పరిశీలించి కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### రైతులు అధికారుల సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ సంచాలకులు చత్రునాయక్

ఇల్లందకుంట, మార్చి 22: రైతులు తమ వ్యవసాయ పనుల్లో అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయ శాఖ సంచాలకులు చత్రునాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని సిరిసేడు గ్రామంలోని రైతు వేదికలో మండల వ్యవసాయాధికారిని గుర్రం రజిత ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చత్రునాయక్ మాట్లాడారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరి పైరుకు అగ్గి తెగులు, మెడ విరుపు తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. అగ్గి తెగులు నివారణకు ట్రై సైక్లోజోల్ 0.6 గ్రాములు, మాస్కోజెబ్ 2.5 గ్రాములు ఐసోప్రోథయోలెన్ 2.5 గ్రాములు నీటిలో కలుపుకొని తెగులు ఉధృతిని బట్టీ 10నుంచి 15రోజుల వ్యవధిలో రెండుసార్లు స్ప్రే చేయాలన్నారు. అదేవిధంగా పాముపొడ తెగులు గమనించినట్లయితే హైక్సెకెనజోల్ 2ఎంఎల్, వాలిడామైసిన్ 2ఎంఎల్, ప్రొపికొనిజోల్ 1ఎంఎల్ లీటర్ నీటికి కలిపి 15రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలని సూచించారు. కాండం కుళ్లు తెగులు గమనించినట్లయితే హెక్సాకోనజోల్ 2ఎంఎల్, వాలిడామైసిన్ 2ఎంఎల్, కార్బండెజమ్ 1 గ్రాము 15 రోజుల్లో రెండుసార్లు స్ప్రే చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో మమత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు..

### - మంథని సీఐ వెంకటేశ్వర్లు

రామగిరి, మార్చి 22: సోషల్ మీడియా వేదిక రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని మంథని సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం రామగిరి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత దూషణలు, హెచ్చరించడం వంటి పోస్టులు పెట్టవద్దని సూచించారు. సోషల్ మీడియాపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ఎవరైనా తప్పుడు పోస్టులు పెట్టినట్లైయితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా యువత గంజాయి మత్తులో నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి రవాణాపై సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిలించి అల్లర్లు సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ సందీప్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సుల్తానాబాద్ సీఐ

కాల్వశ్రీరాంపూర్, మార్చి 22: సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి మండలంలోని మొట్లపల్లి, జాఫర్‌ఖాన్‌పేటలో శుక్రవారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. రాబోయే లోక్ సభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి సదుపాయాలు, భద్రత తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలింగ్ సందర్భంగా ఎవరైనా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాల న్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఓంకార్ యాదవ్, సిబ్బంది ఉన్నారు.

## సంక్షిప్త సమాచారం

● సుల్తానాబాద్ : శాలివాహన జయంతి కార్యక్రమాన్ని సుల్తానాబాద్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శాలివాహన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమ్మర సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు టీకే శ్రీనివాస్, పట్టణశాఖ అధ్యక్షుడు నల్లవెల్లి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి టీకే రమేష్, సత్యనారాయణ, రవీందర్, తిరుపతి, సతీష్, సంజీవ్ వెంకటేశ్ తదతరులు పాల్గొన్నారు.

● ఓదెల : ప్రసిద్ధ శైవ క్షేత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో అర్చకులు శుక్రవారం శైవాగమ స్థాపనచార్య ఆది జగద్గురు రేణుక ఆచార్య భగవత్పాదుల జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు.

● పెద్దపల్లి కల్చరల్ : పెద్దపల్లిలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు చందపల్లి మినీహైడ్రాలిక్ పవర్ ప్లాంట్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ అశోక్ కుమార్, నటరాజన్, చొప్పరి వంశీ పాల్గొన్నారు.

● పెద్దపల్లి కల్చరల్ : సమ్మెటివ్ అసెస్‌మెంట్ టైం టేబుల్ ఉపాధ్యాయులకు, విద్యార్థులను గందరగోళపరి చే విధంగా ఉన్నందున సవరించాలని జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షప్రధానకార్యదర్శులు కర్రు సురేష్, గండు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఒక తరగతికి ఒక సబ్జెక్టు, ఇంకో తరగతికి ఇంకో సబ్జెక్టు కాకుండా అన్ని తరగతులకు ఒకే సబ్జెక్టు ఉండేలా టైం టేబుల్‌ను సవరించరాలని కోరారు.

● జూలపల్లి : కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ గడ్డం వంశీకృష్ణకు ఇవ్వడంపై మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు పాటకుల మహేష్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాదాసు విజయ్, పాటకుల కొమురయ్య, చింతమల్ల రాములు, భూమయ్య, మొండయ్య, రామస్వామి, లక్ష్మి, కొమురమ్మ, రంగయ్య, సురేస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● ధర్మారం : పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణ పేరును ఖరారు చేయడంపై ధర్మారంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ప్రధాన చౌరస్తాలో ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. టపాసులు కాల్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

● అంతర్గాం : పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గడ్డం వంశీని కాంగ్రెస్ పార్టీ ప్రకటించడంపై కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలో స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం మధుగౌడ్, నాయకులు ఆవుల గోపాల్ యాదవ్, ఇండిబిల్లి రవీందర్, విజయ్, తిరుపతి, రవి తదితరులు పాల్గొన్నారు.

● కోల్‌సిటీటౌన్ : గోదావరిఖనిలోని పరుశురామ్‌నగర్‌కు చెందిన నేత్రదాత గడ్డి రాజకొమురయ్యకు సదాశయ ఫౌండేషన్ శుక్రవారం నివాళులు అర్పించింది. శుక్రవారం నేత్రదాత సంస్మరణ సభలో రాజకొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అభినందన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొంత శ్రీనివాస్, సదాశయ ఫౌండేషన్ బాధ్యులు లింగమూర్తి, ఆరేపల్లి రాజమౌళి, కేఎస్‌వాసు, దేవి లక్ష్మీనర్సయ్య, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

● కళ్యాణ్‌నగర్ : రామగుండం కార్పొరేషన్ 6వ డివిజన్‌కు కోటి రూపాయల నిధులు మంజూరుచేసిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కాంగ్రెస్ పార్టీ 6వ డివిజన్ ఇన్‌చార్జి గడ్డం శ్రీను ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

# గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : కలెక్టర్



చిన్నారులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు ప్రెగ్నెన్సీ సమయంలో తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మంచి పౌష్టికాహారం తీసుకుంటూ చురుగ్గా ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఆయన పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామూహిక శ్రీమంతం, అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ గర్భిణులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంగా ఉంటూ మంచి ఆహారం తీసుకుంటే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారనే అంశాన్ని మహిళలు గుర్తించుకోవాలని కలెక్టర్ అన్నారు. మహిళలు ప్రెగ్నెన్సీ సమయంలో ఆనందంగా ఉండాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, పాలు, పండ్లు, పప్పు ధాన్యాలు, గుడ్డు వంటి పోషక విలువలు గల ఆహారం సమృద్ధిగా తీసుకోవాలని అన్నారు. ప్రెగ్నెన్సీ సమయంలో మహిళలు చురుగ్గా ఉండాలని ప్రతి రోజు కొంత దూరం నడిచే అలవాటు చేసుకోవాలని, మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలని, డాక్టర్లు, ఆశా కార్యకర్తలు సూచించే వ్యాయామాలు తప్పనిసరిగా చేయాలని కలెక్టర్ కోరారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ చేతుల మీదుగా కార్యక్రమానికి విచ్చేసిన గర్భిణీ మహిళలకు శ్రీమంతం, పసిపిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసనం నిర్వహించడంతో చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాల స్టాల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్ ఖాన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి కృపాబాయి, సీడీపీఓ కవిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, టీచర్‌లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### పేదవారిపై ప్రేమ, దయ కలిగి ఉండాలి..

పెద్దపల్లి కల్చరల్, మార్చి 22 : జీవితాలను మానవతా విలువలతో గడపాలనేదే సర్వ మతాలు బోధించే అంశమని, మార్గాలు వేరైనప్పటికి అందరి లక్ష్యం ఒకటేనని, సాటి మనిషిని ప్రేమిస్తూ పేదవాడికి చేయూతనిస్తూ జీవనం సాగించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం తెలంగాణ మైనారిటీస్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ఆధ్వర్యంలో సమీకృత కలెక్టరేట్‌లోని కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన దావత్ ఇఫ్తార్ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసం 3అంశాలను బోధిస్తుందని, మనలో ఉన్న కోపాన్ని తగ్గించుకొని సహనాన్ని పెంచుకోవాలన్నారు. తప్పులను సాహసంగా ఎదిరించడం, బయట తప్పులనే కాకుండా మన లోపల మనం చేసే తప్పులను సైతం గుర్తించి వాటిని ఎదిరించి మన లోపాలను సరి చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ మేరాజ్ మహమూద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాఠశాల అకాడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పి.ఎం. షేక్, టీజీవో, టీఎన్‌జీవో, టి.ఆర్.ఈ.ఎస్.ఏ., ఎం.ఈ. డబ్ల్యూఏ యూనియన్ ప్రతినిధులు, మైనారిటీస్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ మొహిఉద్దీన్, జనరల్ సెక్రెటరీ అబ్దుల్ ఖాదర్, వైస్ ప్రెసిడెంట్ ఎండి వజాహత్ అలీ, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### - మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

కాల్వశ్రీరాంపూర్, మార్చి 22: బీఆర్ఎస్ అధికారంలో ఉండగా రెండు పంటలకు సాగునీరు అందించామని, సాగునీరు అందించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం హయాంలో ఒక గుంట పొలం ఎండిపోకుండా నీరు అందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో సాగునీరందక వందలాది ఎకరాల పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారం పోయినంత మాత్రాన ఓటమితో ఎవరూ బాధపడద్దని, మొండి ధైర్యంతో ప్రజా సమస్యలపై పోరాడాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, ఎంపీపీ నూనేటి సంపత్, కూనారం సింగిల్ విండో చైర్మన్ గజ్వెల్లి పురుషోత్తం, మాజీ సర్పంచ్ ఆడపు శ్రీదేవి రాజు, బీఆర్ఎస్ నాయకులు కొట్టె రవీందర్, నిదానపురం దేవయ్య, కూకట్ల నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

● ఓదెల, మార్చి 22 : మండలకేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ మండల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఈశ్వర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ రేణుకదేవి, జడ్పీటీసీ గంట రాములు, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు ఆళ్ల రాజిరెడ్డి, వైస్ ఎంపీపీ జీల తిరుపతి, పార్టీ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, మ్యాడగోని శ్రీకాంత్, మాజీ ఎంపీపీ బుద్దే రామస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● జూలపల్లి : మండల కేంద్రంలోని ఒక ప్రైవైటు ఫంక్షన్‌హాల్ శుక్రవారం బీఆర్ఎస్ మండల ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఉద్యమస్ఫూర్తితో సైనికుల్లా పనిచేసి పెద్దపల్లి పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకోవాలన్నారు. జడ్పీ చైర్మన్ పుట్ట మధు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జడ్పీటీసీ బొద్దుల లక్ష్మీనర్సయ్య, నాయకులు దాసరి ఉష, గ్రంథాలయ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంది చొక్కారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

● ఎలిగేడు : మండలకేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే అండగా ఉండి పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, దాసరి ఉష, మండల శాఖ అధ్యక్షుడు బైరెడ్డి రామిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, తానిపర్తి మోహన్‌రావు, తూడి మురళి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను మోసం చేసిన వెంకటస్వామి కుటుంబం

### - పెద్దపల్లి పార్లమెంట్‌లో చేసిందేమి లేదు - బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గొమాసే శ్రీనివాస్

గోదావరిఖని, మార్చి 22: పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో వెంకటస్వామి కుటుంబ చేసిందేమి లేదని బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానికేతరుడైన వెంకటస్వామి పెద్దపల్లి ఎంపీగా కోట్లు కూడగట్టాడన్నారు. ఇక్కడ సంపాదించిన డబ్బులతో ఇతర ప్రాంతాల్లో ఫ్యాక్టరీలు పెట్టారని, 14సంవత్సరాలు వెంకటస్వామి ఎంపీగా, ఐదు సంవత్సరాలు వినోద్ ఎమ్మెల్యే, వివేక్ ఎంపీగా పని చేసినా ఇక్కడి ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. వేరే ప్రాంతాల్లో ఫ్యాక్టరీలు పెట్టారని, ఒక్క ఫ్యాక్టరీనైనా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. దళితులను సామాజికంగా, రాజకీయంగా దోపిడీ చేశారని, మాదిగ, మాలలు, నేతకానిలు రాజకీయంగా అభివృద్ధి చెందలేదన్నారు. ఇక్కడి ప్రజలను వివేక్ కుటుంబం 40ఏళ్లుగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈవిలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, కందుల సంధ్యారాణి, బల్మూరి వనిత, గుండబోయిన లక్ష్మణ్, శీలారపు పర్వతాలు, పెద్దపల్లి రవీందర్, గోపగోని నవీన్, జక్కుల నరహరి, కోమళ్ల మహేష్, సాతిరి గంగరాజు పాల్గొన్నారు.

## ఓటుహక్కును సద్వినియోగం చేసుకునేలా చైతన్యపర్చాలి

కోల్‌సిటీ, మార్చి 22: ఓటుహక్కు సద్వినియోగం చేసుకునేలా కుటుంబ పెద్దలను చైతన్యపరచాలని రామగుండం కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ విద్యార్థులను కోరారు. రామగుండం కార్పొరేషన్ ఆధ్వర్యంలో గోదావరిఖని సప్తగిరికాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలే ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్యోతిబా పూలే ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, కార్పొరేషన్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్

### పార్లమెంట్ ఎన్నికల కోసం బాధ్యుల ఎంపిక

గోదావరిఖని, మార్చి 22: పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపే లక్ష్యంగా నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ కోరారు. ఎన్నికల ప్రచార నిర్వహణల కోసం శుక్రవారం చందర్ రామగుండం నియోజకవర్గానికి సంబంధించి ప్రాంతాల వారీగా బాధ్యులను ఎంపిక చేశారు. అంతర్గాం, పాలకుర్తి మండలాలకు, రామగుండం కార్పొరేషన్‌లోని 50 డివిజన్ల వారీగా ఇన్‌చార్జిలను నియమించారు.




### ఆర్జీ-3 ఏరియాలో పర్యటించిన జీఎం (సర్వే)

రామగిరి, మార్చి 22: సింగరేణి సంస్థ ఆర్జీ-3 ఏరియాలోని ఓసీపీ-1,2లలో శుక్రవారం కార్పొరేట్ సర్వే జీఎం జైనుల్లాబుద్దీన్ పర్యటించారు. ప్రాజెక్టు నడుస్తున్న పనులను వ్యూ పాయింట్ ద్వారా పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. జీఎంను అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాధాకృష్ణ, రాజేందర్, రామారావు, జనార్ధన్, జీఎల్ రాజు, యానంది శెట్టి, నారాయణ, మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఆర్జీ-3, ఏపీఏలో క్వార్టర్స్ కౌన్సెలింగ్

రామగిరి, మార్చి 22: సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ ఉద్యోగులకు క్వార్టర్స్ కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సెక్యూరిటీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్‌లో 183 ఖాళీ క్వార్టర్స్ ఉండగా ఫ్రెష్ అలాట్మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కోసం 91మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, 32 మంది ఉద్యోగులు హాజరయ్యారు. అందులో 27మంది క్వార్టర్స్‌ను ఎంపిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో టూ జీఎం రఘుపతి, అధికారులు రవీందర్‌రెడ్డి, గుర్రం శ్రీహరి, నాయకులు రామచంద్రరెడ్డి, కొట రవీందర్‌రెడ్డి, మహేందర్, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### స్టోర్‌లో స్క్రాప్ తనిఖీ

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 22: ఆర్జీ-2 ఏరియాలోని ఓసీపీ-3 స్టోర్‌లో శుక్రవారం అధికారులు స్క్రాప్‌ను తనిఖీ చేశారు. జీఎం(స్టోర్స్) మాచరయ్య స్టోర్‌లో భద్రపరిచిన స్క్రాప్ వివరాలు, రికార్డులను పరిశీలించారు. మాచరయ్య వెంట ఆర్జీ-2 ఏరియా ఇంజనీర్ నరసింహారావు, డీజీఎం ఓసీపీ-3 స్టోర్ రామకృష్ణ, ఆర్జీ-1 సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి న్నారు.

# నేడు ఖనిలో టీబీజీకేఎస్ వర్కింగ్ కమిటీ సమావేశం

గోదావరిఖని, మార్చి 22: సింగరేణిలో జాతీయ కార్మిక సంఘాలకు దీటుగా ఎదిగిన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘానికి గడిచిన గుర్తింపు సంఘం ఎన్నికల ముందు గట్టి దెబ్బతగిలింది. అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రావ్, రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య గుర్తింపు సంఘం ఎన్నికలకు నెలరోజుల ముందే రాజీనామాలు చేయడం టీబీజీకేఎస్ ఎన్నికల్లో పోటీ చేయలేక ఏఐటీయూసీకి మద్దతు తెలిపింది. మళ్లీ సింగరేణిలో టీబీజీకేఎస్‌ను పునరుజ్జీవం చేసేందుకు కార్యాచరణ మొదలైంది. ఇందుకోసం గోదావరిఖని కేంద్రంగా శనివారం టీబీజీకేఎస్ కేంద్ర కమిటీతో పాటు 11డివిజన్ల ప్రతినిధులతో పాటు వర్కింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో టీబీజీకేఎస్‌ను సింగరేణిలో మరోసారి బలమైన కార్మిక సంఘంగా నిలబెట్టేందుకు కార్యాచరణకు సిద్ధపడుతున్నారు. టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన మిర్యాల రాజిరెడ్డి నాయకత్వంలో ఈ సమావేశం జరుగుతున్నది. సింగరేణిలోని టీబీజీకేఎస్ ఆఫీస్ బేరర్స్ 100మంది ఈ సమావేశానికి హాజరవుతున్నట్లు తెలిసింది. తిరిగి యూనియన్‌ను నడిపించేందుకు రాజిరెడ్డికే బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. ఈ సమావేశంలో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసి దానికి కన్వీనర్‌గా రాజిరెడ్డిని నియమించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇంత కాలం బీఆర్ఎస్‌కు అనుబంధంగా ఉన్న టీబీజీకేఎస్ ఇకపై ఏ రాజకీయ పార్టీకి అనుబంధ కార్మిక సంఘంగా కొనసాగరాదనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తున్నది. స్వతంత్ర కార్మిక సంఘంగానే సింగరేణి కార్మికవర్గ ప్రయోజనాల కోసం పోరాటాలకు సిద్ధమయ్యేందుకు ఈ సమావేశం జరుగుతున్నట్టు తెలుస్తున్నది. ఈ సమావేశంలో యూనియన్ మహాసభలను ఎప్పుడు నిర్వహించుకోవడం అనేది కూడా నిర్ణయించనున్నారు. ఆ మహాసభల్లో యూనియన్ నూతన కమిటీ ఏర్పాటు జరుగుతుంది. అదే క్రమంలో 11డివిజన్లకు కమిటీలను కూడా వేయనున్నారు. అయితే నేటి సమావేశంలోనే డివిజన్లవారీగా అడ్‌హక్ కమిటీలను కూడా నిర్ణయించే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో బొగ్గు బాయిలు, ఓపెన్‌కాస్టుల స్థాయిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడేందుకు ఒక స్వతంత్రమైన కార్మిక సంఘం అవసరముందని టీబీజీకేఎస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### అండర్‌గ్రౌండ్ అలవెన్స్ రికవరీని నిలిపివేయాలి

బెల్లంపల్లి, మార్చి 22: శాంతిఖనిగనిలో కార్మికుల నుంచి చేస్తున్న అండర్‌గ్రౌండ్ అలవెన్స్ రికవరీని వెంటనే నిలిపివేయాలని ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం గనిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి మాట్లాడుతూ అలవెన్స్ రికవరీతో కార్మికులు నష్టపోతున్నారన్నారు. కార్మికులను మానసిక క్షోభకు గురి చేసే ఉత్తర్వులను యాజమాన్యం విరమించుకోవాలన్నారు. అనంతరం గని మేనేజర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, దాసరి తిరుపతిగౌడ్, మంతెన రమేష్, కార్మికులు పాల్గొన్నారు.

### ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, మార్చి 22 : ఎస్ఆర్పీ 1 ఇంక్లైన్‌లో సత్యనారాయణ అనే రూఫ్‌బోల్టర్ కార్మికుడు ప్రమాదవశాత్తు పుల్లీలో రెండు కాళ్లు ఇరుక్కుపోవడంతో అతని కాళ్లు తెగిపోయాయని, ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి మణిరాంసింగ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వారం క్రితం మందమర్రి ఏరియాస్టోర్‌లో రాజు అనే కార్మికుడు మృతిచెందిన ఘటన మరువకముందే ఎస్ఆర్పీ వన్ ఇంక్లైన్‌లో కార్మికుడి రెండు కాళ్లు తెగిపోవడం బాధాకరమన్నారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నారాయణ, పాషా, చంద్రమౌళి పాల్గొన్నారు.

### ఎల్ఐసీ భవన నిర్మాణానికి భూమి పూజ




శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్ జగన్నాథ్

కోల్‌సిటీటౌన్, మార్చి 22: గోదావరిఖనిలో ఎల్ఐసీ రామగుండం బ్రాంచి భవన నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి జీవిత బీమా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం జగన్నాథ్, హైదరాబాద్ జోనల్ మేనేజర్ ఎల్ కె శ్యామ్‌సుందర్ హాజరై భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రావు, కరీంనగర్ సీనియర్ డివిజన్ మేనేజర్ ఎస్‌వీ ప్రసాదరావు, బ్రాంచిమేనేజర్ ఎన్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ నాగేంద్రకుమార్, ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు, ఏజెంట్లు కాశెట్టి శివ, మోతె ప్రశాంత్ పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

పెద్దపల్లిటౌన్, మార్చి 22: పెద్దపల్లి మండలం అందుగులపల్లికి చెందిన రైల్వే ఉద్యోగి దొమ్మటి సదిపై దాడి చేసిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆల్‌ఇండియా అంబేడ్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, మాదిగ ఐక్య వేదిక నాయకులు కోటగిరి పాపయ్య డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దళితులపై జరుగుతున్న దాడులను అధికారులు అరికట్టాలని కోరారు. దాడిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సదిపై దాడి చేసిన సారయ్య అతని అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని కోరారు.

### ఎంపీ అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ పునరాలోచించాలి

పెద్దపల్లిటౌన్, మార్చి 22: పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై అధిష్ఠానం పునరాలోచన చేయాలని దళిత ఐక్య వేదిక పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి మామిడిపల్లి బాపయ్య, మాదిగశక్తి వ్యవస్థాపకులు, తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్ (సన్నీ), నాయకులు కోటగిరి పాపయ్య డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ ఎస్సీ రిజర్వు స్థానంలో ధనికులు, వ్యాపారులు వెంకటస్వామి కుటుంబానికి టికెట్లు ఇవ్వడం సరికాదన్నారు. మాదిగలకు టికెట్ ఇవ్వకుంటే త్వరలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో కల్లెపల్లి రవి, తాళ్లపల్లి అంజయ్య, కుమ్మరి శ్రీశైలం, మోదుంపల్లి సందీప్, సందీప్, రాజేందర్, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

### సీఎం రేవంత్‌ను కలిసిన ఎమ్మెల్యే వివేక్, వంశీకృష్ణ



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ

పెద్దపల్లిటౌన్, మార్చి 22: పెద్దపల్లి ఎస్సీ రిజర్వుడు పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణకు టికెట్ కేటాయించడంపై సీఎం రేవంత్ రెడ్డికి చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు వివేక్, వినోద్, వంశీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, పెద్దపల్లి కాంగ్రెస్ నాయకులు వునుకొండ శ్రీధర్‌పటేల్, తదితరులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

### ఘనంగా చక్రస్నానం, వసంతోత్సవం

సుల్తానాబాద్, మార్చి 22: సుల్తానాబాద్ పట్టణంలోని వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో హోమాలకు సంబంధించి పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి వారి రథోత్సవం ప్రారంభమైంది. గుడిమిట్టపల్లి రాజరాజేశ్వరస్వామి వారి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తెప్పోత్సవంలో స్వామివారి చక్రస్నానం అర్చకులు, ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించింది. అనంతరం అక్కడే వసంతోత్సవాన్ని జరుపుకున్నారు. శుక్రవారం రాత్రి స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయచైర్మన్ పల్లా మురళి సదాలక్ష్మి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

### 'ఆరోహణ-24'లో పీజీ విద్యార్థులకు బహుమతులు

కోల్‌సిటీటౌన్, మార్చి 22: ఇటీవల కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నిర్వహించిన శాతవాహన ఆరోహణ-24 కార్యక్రమంలో గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలకు చెందిన ఎంబీఏ విద్యార్థులు వివిధ విభాగాల్లో బహుమతులు సాధించారు. విజేతలకు కన్వీనర్ డాక్టర్ మనోహర్, యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రంగప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. బహుమతి సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ రమాకాంత్, అధ్యాపకులు డాక్టర్ సురేష్‌కుమార్, రవి, ప్రసాద్, సావిత్రి, సల్మాఅజీజ్, రమేష్, అజయ్, యాదయ్య అభినందించారు.

### రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

పాలకుర్తి, మార్చి 22: మండలం పరిధిలోని యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్‌షిప్ 2024కు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ ఇస్మాయిల్ శుక్రవారం తెలిపారు. ఈనెల 13వ తేదీన గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన సాఫ్ట్ బాల్ సబ్‌జూనియర్ జిల్లా స్థాయి పోటీల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచి ఈ నెల 23,24వ తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఇండోర్ స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జి వంశి, బి అవినాష్, డి అభినయ్, పి తనూష్, బి సాయిఅక్షయ, ఎస్ తనూష్ ఎంపికయ్యారని అన్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అఫ్జల్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కల్వల సంతోష్, ఉపాధ్యాయులు అభినందించారు.

### రెండు ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు

కోల్‌సిటీటౌన్, మార్చి 22: గోదావరిఖనిలోని రెండు వేర్వేరు పాఠశాలల్లో టీచర్లు ఇద్దరు విద్యార్థులను చితకబాదిన విషయంపై జిల్లా విద్యా శాఖ స్పందించింది. స్థానిక ఎల్‌బీనగర్‌లోని ఇండో అమెరికన్ స్కూల్, కళ్యాణ్‌నగర్‌లోని వర్షిణీ ప్రైమరీ పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇండో అమెరికన్ స్కూల్‌లో మేకల పునీత్ అనే మూడో తరగతి విద్యార్థిని టీచర్ చితకబాదడంతో సదరు విద్యార్థికి గాయాలయ్యాయి. అలాగే వర్షిణీ ప్రైమరీ స్కూల్‌లో యుకేజీ విద్యార్థి ఆదర్శ్‌ను కన్ను పక్కన పెన్నుతో టీచర్ పొడవడంతో గాయమైంది. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లగా విచారణకు ఆదేశించారు. ఈ విషయంపై ఈనెల 21న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) విచారణ చేశారు. కాగా శుక్రవారం జిల్లా విద్యాధికారి, రామగుండం ఎంఈవో ద్వారా సదరు పాఠశాలల యాజమాన్యాలకు షోకాజ్ నోటీసులు పంపించారు. ఈ నోటీసులకు మూడురోజుల్లో పూర్తిస్థాయి వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో అధికారులు తెలిపారు.

### ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ

ధర్మారం, మార్చి 22: లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై శుక్రవారం ధర్మారంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఒక్కరు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తహసీల్దార్ రజిత సూచించారు. ర్యాలీలో ఎస్సై సత్యనారాయణ, ఎంఈవో ఛాయాదేవి, మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### పేద విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

కరీంనగర్ టౌన్, మార్చి 22: రోటరీ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల కు సైకిళ్ల పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు గొరిట్యాల వెంకటకిషన్ తెలిపారు. శుక్రవారం నగరంలో జరిగిన కార్యక్ర మంలో క్లబ్ అధ్యక్షుడు వెంకటకిషన్, ప్రధాన కార్యదర్శి పాక పావనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.